ప్రజాశక్తి
శుక్రవారం 4 ఏప్రిల్ 2025 8 పేజీలు
ప్రకాశం బాపట్ల







ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు, సిపిఎం నాయకులు

ఖాళీ బిందెలతో నిరసన ర్యాలీ

- మౌలిక వసతుల కల్పన పట్ల పాలకుల నిర్లక్ష్యం
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి
- మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా

5లో




ధర్నా చేస్తున్న పెన్షనర్లు

హక్కులకు భంగం కలిగిస్తే ఉద్యమం

5లో

బాలారిష్టాలు దాటని బాపట్ల జిల్లా



- జిల్లా ఏర్పడి నేటికి మూడేళ్లు
- మూడేళ్లలో ముగ్గురు కలెక్టర్లు...
- జిల్లా అభివృద్ధికి ముందుకు పడని అడుగులు
- ఊహాజనిత విజన్ నివేదికలు..
- నిధులు మంజూరు కాని దుస్థితి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా ఏర్పడి మూడేళ్ళు పూర్తి కావస్తోంది. మూడేళ్లలో ముగ్గురు కలెక్టర్లు మారారు. జిల్లా ఏర్పడినప్పటి నుంచి కలెక్టర్లు జిల్లా అభివృద్ధికి తమ వంతుగా శాఖల వారీగా పలు రకాల నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లా అయితే ఏర్పాటు చేశారు గానీ, అందుకు అనుగుణంగా నిధులు మంజూరు చేయలేదు. జిల్లా కేంద్రంలో మానవ వనరుల శాఖకు చెందిన భవనాలు ఉండటంతో కొన్ని జిల్లా కార్యాలయాలు ఏర్పాటు చేశారు. జిల్లాకు వచ్చిన అధికారులు తమకు దొరికిన గదుల్లోనే సర్దుకున్నారు. 10 నెలల క్రితం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు విడుదల చేసే పరిస్థితి లేదు. గడిచిన కాలంగా ఊహాజనిత విజన్ రిపోర్టులతో జిల్లా కలెక్టర్లు, అధికారులు కుస్తీ పడుతున్నారు. నిధులు లేకుండా జిల్లాని అభివృద్ధి పథంలో నడిపేందుకు ఉన్న అవకాశాల గురించి అన్వేషిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మూడు పర్యాయాలు జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశాల్లో చెప్పిన మేరకు పలు సర్వేలు నిర్వహించారు. అందులో ఒకటి పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్ (పి4) సర్వే. ప్రస్తుతం పి4 కార్యక్రమం అమలు చుట్టూనే జిల్లా అధికార యంత్రాంగం యావత్తూ చెక్కర్లు కొడుతోంది. జిల్లా అభివృద్ధి, జిల్లాలోని నిరుపేదల అభ్యున్నతి పి4 ద్వారానే సాధ్యమన్నది ప్రభుత్వ ఉద్దేశంగా ఉంది.

జిల్లా అభివృద్ధి చెందాలంటే జిల్లా కార్యాలయాల ఏర్పాటు జరగాలి. అన్ని శాఖల అధికారులు స్థానికంగా ఉండే పరిస్థితులు ఉండాలి. జిల్లా అభివృద్ధికి తోడ్పడే రంగాలను బలోపేతం చేసే కృషి జరగాలి. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు చేయూతనివ్వాలి. వ్యవసాయ, ఉద్యాన రంగాల అభివృద్ధికి తోడ్పాటునందించాలి. కానీ జిల్లా ఏర్పడి మూడేళ్లు గడిచినా జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియదు. పూర్తి స్థాయి పరిశ్రమల శాఖ అధికారులు జిల్లాలో కొలువుదీరిన పరిస్థితి లేదు. జిల్లాలో 103 కిలోమీటర్ల మేర సముద్రతీర ప్రాంతం ఉంది. పర్యాటక రంగం ద్వారా జిల్లా అభివృద్ధి సాధ్యపడుతుందని భావిస్తున్నారు. కానీ జిల్లాలో నేటికీ పర్యాటక శాఖ కార్యాలయం గానీ, పూర్తిస్థాయి అధికారి గానీ లేకుండా పోయారు. జిల్లా అభివృద్ధికి తోడ్పడే పలు శాఖల కార్యాలయాలు జిల్లాకు తరలిరాలేదు. ప్రధానంగా జిల్లా పరిషత్ విభజన సాధ్యపడలేదు. జిల్లా పరిషత్‌కు స్థానికంగా అధికారి లేరు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల ప్రాతిపదికనే ▶ 2లో

'చీరాల' ఛైర్మన్

'జంజనం'పై అవిశ్వాసం.?

- మంచి ముహూర్తం చూసి ముందుకు వెళ్లాలని అధికార పార్టీ నిర్ణయం
- రసవత్తరంగా మారనున్న చీరాల మున్సిపల్ రాజకీయం



ప్రజాశక్తి-చీరాల, బాపట్ల జిల్లా

వైసిపికి చెందిన చీరాల మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని వైసిపి నుంచి అధికారపార్టీ టిడిపిలో చేరిన కౌన్సిలర్లు ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ మేరకు స్థానిక శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్యను కలిసి ఇప్పటికే పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే కొండయ్య నుంచి సానుకూల సంకేతాలు రావడంతో ఛైర్మన్‌కు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు. మంచి ముహూర్తం చూసి ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించేందుకు కావలసిన 18 సంతకాలతో కూడిన విజ్ఞాపన పత్రాన్ని జిల్లా కలెక్టర్‌ను కలిసి ఇవ్వాలని నిర్ణయించారు. ఛైర్మన్ జంజనం స్థానంలో నూతనంగా ఎవరిని ఛైర్మన్‌గా ఎన్నుకోవాలన్న నిర్ణయాన్ని ఎమ్మెల్యే మాలకొండయ్యకే వదిలిపెట్టారు.

చీరాల మున్సిపాలిటీకి నాలుగేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో టిడిపి గుర్తుపై ఒక్కరు కౌన్సిలర్‌గా గెలుపొందగా, వైసిపి తరపున 19 మంది, వైసిపి రెబల్స్‌గా పోటీ చేసిన వారు 11 మంది, స్వతంత్రులుగా పోటీ చేసిన ఇద్దరు కౌన్సిలర్లుగా గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కొందరు, ఎన్నికలు జరిగి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరికొందరు కౌన్సిలర్లు టిడిపిలో చేరారు. ప్రస్తుతం మున్సిపల్ కౌన్సిల్‌లో టిడిపి తరపున 14 మంది, వైసిపి తరపున 14 మంది, వైసిపి రెబెల్స్ 5 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఛైర్మన్‌పై అవిశ్వాసతీర్మానం పెడితే మరికొంతమంది వైసిపి కౌన్సిలర్లు టిడిపికి మద్దతు పలుకుతారని భావిస్తున్నారు. వీరితో పాటు వైసిపి రెబెల్ కౌన్సిలర్ల మద్దతు కూడా ఉంటుందని ఆశిస్తున్నారు. వైసిపి నుంచి టిడిపిలో చేరి ఛైర్మన్ పదవిని ఆశిస్తున్న కౌన్సిలర్లు ఒకరిద్దరు చాలాకాలంగా ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం కోసం ఎమ్మెల్యే కొండయ్య వద్ద పదేపదే ప్రస్తావిస్తూ ఆయనపై ఒత్తిడి తెస్తూ వచ్చారు. ఎమ్మెల్యే కొండయ్య మాత్రం మొన్నటి వరకు వేచిచూసే ధోరణిలో ఉన్నారు. పార్టీ అధిష్టానం నుంచి అవిశ్వాస తీర్మానాల విషయమై రాష్ట్రవ్యాప్తంగా ఒక నిర్ణయం తీసుకొని బలం ఉన్న చోట ఛైర్మన్లను దింపాలన్న ప్రతిపాదన వస్తే అప్పుడు చూద్దాం అన్నది ఎమ్మెల్యే ఆలోచనగా తెలుస్తోంది. అయితే ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి తన స్థానాలను నిలుపుకుంది. ఎన్నికలు జరిగిన స్థానాల్లో అధికారపార్టీ గెలిచేంత సంఖ్యాబలం రాకపోవడంతో పార్టీ అధిష్టానం సంవత్సరం లోపు ఉన్న అధికార పదవుల గురించి అంతగా పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలోనే జిల్లాలోని అద్దంకి మున్సిపాలిటీలో ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం గురించి అక్కడ నుంచి మంత్రిగా ఉన్న గొట్టిపాటి రవికుమార్ పట్టించుకోలేదని చెబుతున్నారు. స్థానికంగా తగిన సంఖ్యాబలం ఉంటే అక్కడి ఎమ్మెల్యే అభీష్టం మేరకు అవిశ్వాస తీర్మానాలు పెడుతున్నారు. అవిశ్వాస తీర్మానం పెట్టి ఛైర్మన్‌ను దింపడం అనేది లెక్కలతో కూడిన రాజకీయం. రానున్న సంవత్సర కాలంలో మరలా స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయి. ఈ లోపు అవిశ్వాస తీర్మానం వ్యవహారాలు నడపడం అనేది ఖర్చుతో పాటు, తలకు మించిన భారంగా ఉంటుంది. కాగా చీరాల మున్సిపాలిటీలో 33 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అవిశ్వాస తీర్మానం పెట్టి ఛైర్మన్‌గా నెగ్గాలంటే 23 ఓట్లు కావాలి. ఎక్స్ అఫిషియో ▶ 2లో

'పది' పరీక్షల మూల్యాంకనం ప్రారంభం

9 వరకు సాగనున్న స్పాట్ వాల్యుయేషన్

8లో



ఒంగోలులోని ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

పనిచేయని ఫోన్లు మాకొద్దు..

- 5జి ట్యాబులు ఇవ్వండి
- అంగన్వాడీలను ఉద్యోగులుగా గుర్తించండి
- ప్రాజెక్టు కార్యాలయంలో సెల్‌ఫోన్లు స్వాధీనపరిచిన వైనం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పనిచేయని, కాలం చెల్లిన ఫోన్లతో తాము ఇక్కట్లు పడుతున్నామని, ఆ ఫోన్లతో పనిచేయలేమని, వాటి స్థానంలో కొత్త వెర్షన్ ట్యాబులు పంపిణీ చేయాలని అంగన్వాడీలు గళమెత్తారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన బిఎస్ 2.0 వెర్షన్ యాప్‌లకు మూడేళ్ళ క్రితం ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లు సపోర్ట్ చేయడం లేదని, వాటిని స్వాధీనం చేసుకోవాలని గురువారం సాయంత్రం ఒంగోలు ప్రాజెక్ట్ కార్యాలయం గేటు బయట, అనంతరం పిడి ఛాంబర్ వద్ద బైటాయించారు. ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ, గౌరవాధ్యక్షులు ఎం రమేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాలను నిర్వీర్యం ▶ 2లో

పనిచేయని ఫోన్లు మాకొద్దు..

(మొదటిపేజీ తరువాయి)

చేసేదిశగా 'ఫేస్ రికగ్నిషన్ యాప్' (ఎఫ్ సిఆర్) పేరుతో కొత్త టెక్నాలజీ తెచ్చిందన్నారు. జిల్లాలో 13 ప్రాజెక్టులలో సగం ప్రాజెక్టులు అటవీ ప్రాంతంలో ఉన్నాయని, ఆయాప్రాంతాల్లో సిగ్నల్ అందని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ ప్రతిరోజూ పేస్ రికగ్నైజేషన్ ద్వారా ఉదయం 9 గంటలకు సాయంత్రం నాలుగు గంటలకు అటెండెన్స్ వేయాలని, సిగ్నల్ అందకపోతే ఆబ్సెంట్‌గా పరిగణిస్తారని పేర్కొన్నారు. దీంతో పాటు 11 రకాల రిపోర్ట్స్ ఆ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఉదయం 9 గంటలకి ఎంతమంది పిల్లలు హాజరయితే అంత మందికే డైట్ తీయాల్సి ఉందని, 9 తర్వాత ఆలస్యంగా వచ్చే పిల్లలకు డైట్ ఇచ్చే అవకాశం ఉండదని తెలిపారు. ఈ ప్రక్రియ వల్ల పిల్లలు అంగన్వాడీ కేంద్రాలకు దూరమయ్యే పరిస్థితి ఉందని తెలిపారు. అంచెలంచెలుగా ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలను మూత వేసేందుకే ఈప్రక్రియకు తెర లేపారని ఆరోపించారు. అంగన్వాడీలు పనిచేయడానికి వ్యతిరేకం కాదని, 5జి ట్యాబులు ఇస్తే తాము పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లలో 80 నుంచి 90శాతం పనిచేయడం లేదని విశదీకరించారు. ఈ కారణంగా తమ సొంత ఫోన్లను వినియోగిస్తున్నట్లు గుర్తు చేశారు. 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించే చట్టం చేయాలని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న తమను దోషులుగా చిత్రీకరించడం సరికాదన్నారు. కేవలం గౌరవ వేతనంతో జీవిస్తున్న తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించడం లేదని, ఉద్యోగులుగా తగిన వేతనం పొందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 42 రోజుల సమ్మె కాలంలో అంగన్వాడీ సమస్యలు పరిష్కారిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అణచివేత చర్యలు చేపట్టడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్వాడీలపై పనిభారం తగ్గించి ప్రీస్కూల్ బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా పరిధిలోని ప్రాజెక్టులకు చెందిన అంగన్వాడీల సెల్‌ఫోన్స్ పీడీ కార్యాలయంలో అందజేశారు. మిగిలిన ఫోన్లు రెండు రోజుల్లో ఇస్తామని సంఘనేతలు తెలిపారు. ఆ మేరకు ప్రాజెక్టు డైరెక్టర్ బి హేనాసుజన్‌కు మెమోరాండం అందించారు. ఈ కార్యక్రమంలో అన్ని ప్రాజెక్టుల అధ్యక్ష, కార్యదర్శులు సెక్టార్ నాయకులు ఎం ధనలక్ష్మి, ఎల్లమ్మ, శేషమ్మ, మధుర, పోలమ్మ, శోభ మల్లేశ్వరి, రమాదేవి, ప్రభావతి, మహాలక్ష్మి, మున్నా, హోమిమా పద్మావతి, సిఐటియు జిల్లా నాయకులు ఆర్ మాలకొండయ్య పాల్గొన్నారు.

బాలారిష్టాలు దాటని బాపట్ల జిల్లా

(మొదటిపేజీ తరువాయి)

పాలన జరుగుతోంది. జిల్లా కలెక్టరేట్, జిల్లా కార్యాలయ భవనాల సముదాయ నిర్మాణం గురించిన ఊసే లేదు. జిల్లా సమగ్రాభివృద్ధి చెందాలంటే రవాణా, విద్య, వైద్యం, వ్యవసాయం, తాగునీరు లాంటి రంగాలపై దృష్టి పెట్టడంతో పాటు అందుకు తగిన నిధుల మంజూరు జరగాలి. జిల్లాలో బిసి, ఎస్‌సి, మైనారిటీ కార్పొరేషన్ల ఏర్పాటు జరగలేదు. వికలాంగుల శాఖకూ కార్యాలయం లేదు.

జిల్లా అభివృద్ధికి తోడ్పడే మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు, 300 పడకల బోధనాసుపత్రి, నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు పునాదుల్లోనే ఆగిపోయాయి. బాపట్లలో జిల్లా వైద్యశాల ఏర్పాటు కావాల్సి ఉంది. జిల్లాలోని నిజాంపట్నం వద్ద రూ.451 కోట్ల అంచనాలతో నిర్మాణం చేపట్టిన ఫిషింగ్ హార్బర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. చీరాల వాడరేవు సముద్ర తీరంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని అటకెక్కించారు. నిజాంపట్నం దిండి వద్ద సమీకృత ఆక్వా పార్కు నిర్మాణం ఎప్పటికి జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్‌ల అభివృద్ధికి నిధులు ఇస్తున్నట్లు చెబుతున్నారే తప్ప ఏళ్లు గడుస్తున్నా నిధులు వచ్చిన దాఖలాలు లేవు. చీరాల, ఈపూరుపాలెం వద్ద ఉన్న ఆటోనగర్ ఎలాంటి పరిశ్రమలకు నోచుకోకుండా నిరుపయోగంగా ఉంది. చేనేత రంగ అభివృద్ధికి కృషి జరగాలి.గత ప్రభుత్వ హయాంలో రూ.కోట్ల వ్యయంతో చేపట్టిన గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్‌క్లినిక్‌ల భవనాలు వివిధ దశల్లో నిలిచిపోయి నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని పూర్తి చేసి వినియోగంలోకి తేవాల్సి ఉంది. జిల్లాలో జలజీవన్ మిషన్ పథకం కింద గ్రామాల్లో మంచినీటి కుళాయిల ఏర్పాటు పనులు నిధులు లేని కారణంగా నిలిచిపోయాయి. పండ్లు, కూరగాయల నిల్వల కోసం శీతలీకరణ కేంద్రాలు నిర్మించాలి ఉంది. జిల్లాలో మత్స్యసంపద, ఆక్వా సాగు పెంపుదల కోసం చేసిన ప్రతిపాదనలు రూపుదాల్చాలి. రానున్న కాలంలో అయినా కూటమి ప్రభుత్వం జిల్లా అభివృద్ధికి నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

'జంజనం'పై అవిశ్వాసం.?

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులుగా ఎమ్మెల్యే, ఎంపి ఓటు వెయ్యవచ్చు. చైర్మన్ అభ్యర్థి ఓటు పోను మరో 20 మంది కౌన్సిలర్ల మద్దతు అవసరం. ప్రస్తుతం టిడిపిలో 14 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అంటే మరో ఆరుగురు కావాలి. అవిశ్వాస తీర్మానం పెడితే మద్దతుగా కౌన్సిలర్లు ఎవరు ఉదారంగా ఓటు వేసే పరిస్థితి స్థానికంగా లేదు. రూ 5 లక్షల నుంచి రూ 10 లక్షలు ఆశిస్తున్నారన్న ప్రచారం ఉంది. రూ 5 లక్షల చొప్పున చూసినా కోటి రూపాయలు కావాలి. ఎమ్మెల్యే గట్టిగా జోక్యం చేసుకొని కౌన్సిలర్లకు నచ్చచెబితే ఖర్చు తగ్గవచ్చు. అవిశ్వాస తీర్మానం అంటే తమ మద్దతు కౌన్సిలర్లతో క్యాంపు రాజకీయాలు నడపాలి. అయితే చీరాల మున్సిపాలిటీలో టిడిపి గుర్తుపై గెలిచిన వారు ఒక్క కౌన్సిలరే ఉన్నారు. ప్రస్తుతం చైర్మన్ స్థానం కోరుతున్న వారిలో గోలి స్వాతి ఒక్కరే స్వతంత్రులుగా గెలిచారు. పొత్తూరి సుబ్బయ్య, మించాల సాంబశివరావు, సూరగాని లక్ష్మి, దాసరి శారద, మామిడాల రాములు వైసిపి గుర్తుపై గెలిచిన వారే. ప్రస్తుత చైర్మన్ జంజనం శ్రీనివాసరావును దింపడం అనివార్యం అయితే వైసిపి కౌన్సిలర్లు టిడిపి కౌన్సిలర్ కె యానాదిరావుకు లేదా గోలి స్వాతి, మామిడాల రాములుకు చైర్మన్లుగా మద్దతు ఇచ్చే అవకాశం ఉంది. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ మాట మేరకు నడిచే కౌన్సిలర్లు పది మంది వరకు ఉన్నారు. వారు ఓటింగ్ సమయంలో ఎలా వ్యవహరిస్తారనేది అప్పటి పరిస్థితులను బట్టే ఉంటుంది. వైసిపి విప్ జారీ అంశం కూడా ఇందులో ఉంటుంది. కౌన్సిల్‌లో అవిశ్వాస తీర్మానం పెట్టడం వరకే అధికార పార్టీ చేతిలో ఉంటుంది. తరువాత చీరాల రాజకీయం ఎలా ఉంటుంది అనేది ఎవరికీ అర్థం కాని రీతిలో ఉంటుందని భావిస్తున్నారు. చైర్మన్ జంజనం కోసం మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి రంగంలోకి దిగక తప్పదు. ఒక పక్క ఎమ్మెల్యే కొండయ్య, మరో పక్క మాజీ ఎమ్మెల్యేలు కరణం బలరాం, ఆమంచి కృష్ణమోహన్ అవిశ్వాస తీర్మాన రాజకీయంలో ఉంటారు. అన్నీ అనుకూలిస్తే శుక్రవారం లేదా వచ్చే వారం మంచి రోజు చూసుకొని చైర్మన్ జంజనంపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు టిడిపి మద్దతు కౌన్సిలర్లు సన్నద్ధమయినట్లు తెలుస్తోంది.

హత్యాయత్నం కేసులో ఐదుగురు అరెస్టు

పరారీలో మరో నిందితుడు

వివరాలు వెల్లడించిన డీఎస్పీ మోయిన్

ప్రజాశక్తి-చీరాల

చీరాల మండలం గవినివారిపాలెంలో సిఐఎస్ఎఫ్ జవాన్ హత్యాయత్నం కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ మోయిన్ తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ వెల్లడించారు. చీరాల మండలం గవినవారిపాలెం గ్రామానికి చెందిన చిదరబోయిన నాగేశ్వరరావు ఢిల్లీలోని ఆగ్రాలో సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నాడు. అదే గ్రామంలో నివాసం ఉంటున్న తన నాయనమ్మ రాములమ్మ గత నెల 28న పాత ఇల్లు పడేసి అదే స్థలంలో కొత్త ఇల్లు కట్టుకోవడానికి సిద్ధమైంది. అయితే అదే గ్రామానికి చెందిన చిదరబోయిన లక్ష్మీనారాయణ అతని కొడుకు భరత్ కుమార్, సోదరుడు వీరయ్యలకు స్థలం విషయమై వివాదం ఉంది. రైల్వే పోలీస్‌గా



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మోయిన్

పనిచేస్తున్న వీరి బంధువు పి.లక్ష్మీనారాయణ రాములమ్మతో తలెత్తున్న ఘర్షణలో వారికి సలహాలు ఇస్తూ అవసరమైతే వాళ్ళను చంపటానికి కూడా వెనకాడ వద్దని ప్రోత్సహిస్తూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న చిదరబోయిన నాగేశ్వరరావు తన నాయనమ్మ రాములమ్మ ఇంటి విషయంలో జోక్యం చేసుకున్నాడు. అది మనసులో ఉంచుకొని బాపట్ల కర్లపాలెంలో ఉంటున్న తన మేనల్లుళు అయిన గొర్ల వేణు, వెంపరాల కుమారస్వామిల సాయంతో చిదరబోయిన నాగేశ్వరరావును అంతమొందించి రాములమ్మ వద్ద నుంచి స్థలం తీసుకోవాలని పక్కా పథకం రచించారు. ఇందులో భాగంగా గత నెల 30న ఉదయం గవినివారిపాలెంలో వాకింగ్‌కు వెళ్లి వస్తున్న నాగేశ్వరరావును చంపేందుకు కత్తి, ఇనుప పైపుతో దాడి చేసి కొట్టారు. గమనించిన చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకునే లోపు నిందితులు పరారయ్యారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ మోయిన్, చీరాల రూరల్ సిఐ శేషగిరిరావుల ఆధ్వర్యంలో పోలీసుల బృందం దర్యాప్తు చేపట్టి గురువారం నిందితులు లక్ష్మీనారాయణ, వీరయ్య, భరత్ కుమార్, గొర్ల వేణు, కుమారస్వామిలను అరెస్టు చేశారు. మరో నిందితుడు పిన్నబోయిన లక్ష్మీనారాయణ పరారీలో ఉన్నాడు. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో పోలీసుల పికెటింగ్ ఏర్పాటు చేశారు. కేసును త్వరితగతిన చేధించిన డీఎస్పీ మోయిన్, సిఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్‌లను జిల్లా ఎస్పీ తుషార్ డూడి అభినందించారన్నారు.

కత్తితో భార్యపై భర్త దాడి

పరిస్థితి విషమం.. గుంటూరు తరలింపు

ప్రజాశక్తి-చీరాల



చికిత్స పొందుతున్న సంధ్య

కుటుంబ కలహాలతో భర్త భార్యపై, అడ్డు వచ్చిన అత్తపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేసిన సంఘటన పేరాలలోని మసీదు సెంటర్లో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కరుణాకర్, సంధ్య దంపతులు పేరాల మసీదు సెంటర్లో నివాసం ఉంటున్నారు. గత కొద్దికాలంగా భార్యాభర్తల మనస్పర్ధలు మధ్య చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం కరుణాకర్ కత్తితో కాళ్ళ, సంధ్య ఛాతిపైన విచక్షణ రహితంగా దాడి చేశాడు. అడ్డం వచ్చిన అత్త లక్ష్మిపై సైతం తీవ్రంగా దాడి చేసి గాయపరిచాడు. దీంతో తీవ్రంగా రక్త గాయాలైన క్షతగాత్రులను స్థానికులు ఆటోలో హుటాహుటిన చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంధ్యకు తీవ్రమైన గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. అత్త లక్ష్మి చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతోంది. సమాచారం అందుకున్న టూ టౌన్ సీఐ నాగభూషణం సంఘటన స్థలానికి చేరుకొని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. భార్య సంధ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.



బోల్తా పడిన ట్రాక్టర్

ట్రాక్టరును ఢీకొన్న లారీ

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ట్రాక్టరును లారీ ఢీ కొట్టిన సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడులోని 216 జాతీయ రహదారిపై జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. తిమ్మసముద్రం గ్రామానికి చెందిన ట్రాక్టరు ధాన్యం బస్తాలతో ఒంగోలు వైపు వస్తోంది. అదేక్రమంలో మద్దిరాలపాడు సమీపంలోని ఇనమనమెళ్ళురు రోడ్డువద్ద ఒంగోలు వస్తున్న లారీ వెనక నుంచి ట్రాక్టరును ఢీ కొట్టడంతో ట్రక్కులో ధాన్యం బస్తాలపై కూర్చున్న తిమ్మసముద్రం గ్రామానికి చెందిన ఐ.అంకమ్మరావు, డి. వంశీలు క్రింద పడిపోయారు. తీవ్ర గాయాలైనాయి క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

బియ్యం బదులుగా డబ్బులు తీసుకోండి..

నగదు తీసుకోకుంటే వచ్చే నెల రేషన్ కట్

బహిరంగంగానే ప్రజలకు బెదిరింపులు

ఎండియు వాహనాల్లోనే అక్రమ రవాణా

ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ప్రజలతో వాగ్వాదం చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-తర్లుపాడు

నిరుపేదలకు కనీసం రెండు పూటలా ఆహారం అందించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా పంపిణీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు వచ్చింది. అయితే రేషన్ డీలర్ల ద్వారా లబ్ధిదారు లకు సరఫరా చేయా ల్సిన బియ్యాన్ని కొందరు డీలర్లు అక్రమార్జనే ధ్యేయంగా, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడుతూ జే బులు నింపుకుంటున్నారు. పేదలకు అందాల్సిన ఫలాలు డీలర్లు, ఎండియు ఆపరేటర్లు కుమ్మక్కై పొందుతున్నారు. ప్రతినెల మొదటి తేదీన సివిల్ సప్లై గోదాముల ద్వారా నిర్దే శిత రేషన్ షాపులకు టంచన్‌గా బియ్యం సరఫరా చేస్తారు. అయితే స్టాక్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన రెవెన్యూ అధికారులు నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తున్న కారణంగా ఈ బియ్యం పక్కదారి పడుతున్నట్లు తెలుస్తోంది. ఓవైపు షాపులకు వచ్చే మహిళలకు నేరుగా బియ్యానికి బదులు నగదు చెల్లిస్తూ సొమ్ము చేసుకుంటూ, నిల్వ ఉన్న రైసును మిల్లర్లకు తరలించి ప్రతినెలా అక్రమంగా అర్జిస్తున్నారు.

బహిరంగంగానే బెదిరింపులు..

తాజాగా బుధవారం రాత్రి పది గంటలకు మండలంలోని మంగళ కుంట గ్రామంలో డీలర్ షాప్ నెంబర్ 0810020కి సంబంధించిన ఎండియు వాహనం రేషన్ పంపిణీ చేసేందుకు గ్రామానికి వచ్చింది. స్థానికులు రేషన్ వాహనం రావడంతో బియ్యం తీసుకునేందుకు వచ్చారు. కానీ ఆ ఎండియూ ఆపరేటర్ బియ్యం లేవని, కిలో బియ్యానికి రూ.8 నగదు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. మాకు డబ్బులు వద్దు బియ్యమే కావాలని గ్రామస్తులు అడగడంతో, మీ ఇష్టమైతే డబ్బులు తీసుకోండి, లేకపోతే లేదంటూ తెగేసి చెప్పాడు. ఈనెల డబ్బులు తీసుకోని వారికి వచ్చే నెల కూడా ఇవ్వమంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాడు. నిరుపేదల రేషన్ పంపిణీలో డీలర్లు, ఎండియు వాహన డ్రైవర్లు ఇస్తానురాజ్యంగా వ్యవహరిస్తున్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొందరు డీలర్లు నిబంధనలను తమకు అనుకూలంగా మలుచుకొని, బియ్యాన్ని నేరుగా ఎండియు వాహనాల్లోనే అక్రమంగా రవాణా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ ప్రాంతంలో జరుగుతున్న రేషన్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకొని, పేదలకు అందాల్సిన బియ్యాన్ని సక్రమంగా అందించే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటా: తహశీల్దార్

మంగళకుంట గ్రామంలో రేషన్ బియ్యానికి బదులుగా డబ్బులు తీసుకోవాలని ప్రజలను బెదిరించిన విషయంపై తహశీల్దార్‌ను వివరణ కోరగా పొదిలి ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్ ద్వారా విచారణ చేపడతామన్నారు. రేషన్ బియ్యం బదులుగా నగదు ఇచ్చినట్లు రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సామాజిక తనిఖీలతో పారదర్శకత

డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జి.జోసెఫ్ కుమార్



మాట్లాడుతున్న పీడీ జోసెఫ్ కుమార్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

సామాజిక తనిఖీలతో ఉపాధి హామీ పథకంలో పారదర్శకత పెరుగుతుందని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జి.జోసెఫ్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 16వ విడత ప్రజా వేదికలో ఆయన ప్రసంగించారు. పట్టణాలకు ఉపాధి కోసం వలసలను నివారించి వారు నివసిస్తున్న గ్రామాల్లోనే పేదలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నదని పేర్కొన్నారు. ఏడాదిలో చేపట్టిన పనులను ప్రత్యేక బృందాలు గ్రామాలకు వెళ్లి తనిఖీ చేసి గ్రామ సభల్లో వివరించారని, మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల తీర్మానాలపై మండల ప్రజా వేదికలో చర్చిస్తున్నామని వివరించారు. ఇప్పటికి జిల్లాలోని 34 మండలాల్లో ప్రజావేదికలు నిర్వహించినట్టు వెల్లడించారు. మార్కాపురం మండలంలోనీ కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు అవగాహన లేకపోవడంతో కొత్తవారు కావడంతో వాలంటీర్లకు మూడు రోజులకు మాస్టర్ వేయాల్సిందిగా 6 రోజులు వేయడం జరిగిందని వారి నుండి మండల వ్యాప్తంగా 36 వేల రికవరీ నగదును రాయడం జరిగిందన్నారు. అదేవిధంగా యాచవరం గ్రామంలో హార్టికల్చర్ ద్వారా సాగు చేసిన మొక్కలు చనిపోయిన విషయమై సమగ్ర విచారణ జరిపి నివేదికను అందజేయాల్సిందిగా ఉద్యానవన శాఖ అధికారి డి. రమేష్‌కు ఆదేశాలు ఇచ్చామన్నారు. దాదాపు రెండు సంవత్సరాల కాలం వ్యవధి కావడంతో చెరువులు చెక్ డ్యాములులో మట్టి పూడికల కొలతల్లో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించామన్నారు. అవినీతికి పాల్పడే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని పిడి జోసెఫ్ కుమార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి వందర్ మ్యాన్, ఎంపీడీవో బి. శ్రీనివాసులు, ఎస్‌ఆర్‌పి మూర్తి, ఏపీఓ బి.జీవరత్నం, టిఏలు ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

600 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-బేస్తవారిపేట

స్థానిక ఆర్కే నగర్ జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం రవాణాను గురువారం మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ అడ్డుకున్నారు. రేషన్ బియ్యాన్ని శుద్ధి చేసి వేరే ప్రాంతానికి తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో లారీని సీజ్ చేయడంతో పాటు లారీలో ఉన్న 600 బస్తాల రేషన్ బియ్యాన్ని కంభంలోని ప్రభుత్వ గోదాములకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జితేంద్ర, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రామనారాయణ రెడ్డి, ఎఫ్ఐ సల్మాన్, ఆర్ఐ కాశయ్య పాల్గొన్నారు.

నాటు సారా బట్టీ ధ్వంసం

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం బురుజు పల్లి గ్రామం పరిధిలో గురువారం ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు చేసి నాటు సారా బట్టీని ధ్వంసం చేశారు. 100 లీటర్ల బెల్లం ఊటను, బట్టీని ధ్వంసం చేసి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచినట్లు ఎక్సైజ్ సిఐ ఎం.జయరావు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో సమస్యల తిష్ట

- తాగునీరు, మరుదొడ్లు లేక ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి- భట్టిప్రోలు

ఒకప్పుడు ప్రయాణికుల రాకపోకలతో కళకళలాడే భట్టిప్రోలు రైల్వే స్టేషన్‌లో నేడు సమస్యలు తిష్ట వేశాయి. కరోనా సమయం నుంచి రైల్వేస్టేషన్‌లో కనీస సౌకర్యాలు అందుబాటులో లేవు. దీంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు అవస్థలకు గురవుతున్నారు. కరోనా విపత్తుకు ముందే టికెట్లు ఇచ్చే విధానాన్ని ప్రైవేట్ పరం చేశారు. అప్పటి నుంచి రైల్వే స్టేషన్‌లో కనీసం తాగునీరు, మరుగుదొడ్ల వసతి లేదు. ప్లాట్ ఫామ్ పై ఉన్న చెత్తాచెదారాన్ని ఊడ్చేవారు కూడా లేకపోవడం గమనార్హం. స్టేషన్‌లో కనీసం టీ స్టాల్, టిఫిన్ కూడా లేదు. కరోనాకు ఈ స్టేషన్‌లో తాగునీటి వసతి, ప్లాట్ ఫాం శుభ్రత లాంటి సౌకర్యాలు ఉండేవి. ఆ సమయంలో ప్రయాణికులు నిత్యం తెనాలి, విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు వెళ్లి వచ్చేవారు. రేపల్లె నుంచి తెనాలి వరకు మార్గమధ్యంలో ఉన్న భట్టిప్రోలు స్టేషన్ నుంచే రైల్వేకి ప్రయాణికుల ద్వారా అధిక ఆదాయం లభించేది. నిత్యం వ్యాపారస్తులు, దినసరి కూలీలు, బేల్దారి మేస్త్రీలు సుమారు రెండువేల మందికి పైగా ఈ స్టేషన్ నుంచే ప్రయాణిస్తుంటారు. .



భట్టిప్రోలు రైల్వేస్టేషన్

సైకిల్ స్టాండ్ లేకపోవడంతో వాహనాల చోరీ

గతంలో రైల్వే స్టేషన్ అనుబంధంగా సైకిల్ స్టాండ్ ఉండేది. కరోనా సమయం నుంచి దాన్ని తొలగించారు. తిరిగి ప్రారంభించేందుకు అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకుంటున్న దాఖలాలు లేవు. గతంలో సైకిల్ స్టాండ్‌ను రైల్వే శాఖ వేలంపాట నిర్వహించి కాంట్రాక్టుకు అప్పగించేది. కాంట్రాక్టర్లు ప్రయాణికుల వాహనాలను స్టాండ్‌లోనే పెట్టుకొని రుసుము వసూలు చేసుకునేవారు. సైకిల్ స్టాండ్ ఉన్నప్పటికీ అది నిరుపయోగం మారింది. వాహనాలను భద్రపరిచేవారు లేదు.దీంతో నిత్యం ద్విచక్ర వాహనాలు చోరీలకు గురవు తున్నాయి. దూర ప్రాంతాలకు వెళ్లివచ్చే ప్రయాణికులు ఉదయాన్నే తమ వాహనాలను స్టేషన్ పరిసరా ప్రాంతాల్లో పార్కింగ్ చేసుకుంటున్నారు. పనులు ముగించుకొని సాయంత్రం వచ్చి వాహనాలను తీసుకొని వెళ తారు. కొందరైతే రాత్రి సమయంలో కూడా రావడానికి వీలు కుదరక మరుసటి రోజు వచ్చేసరికి ఆ వాహనాలు చోరీకి గురవుతున్నాయి. ఇలా ఇప్పటి వరకూ సుమారు 100 ద్విచక్ర వాహనాలకు పైగా చోరీకి గురైనట్లు వాహన చోదకులు చెబుతున్నారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కొన్ని వాహనాలను రికవరీ చేసి అప్పగిస్తున్నారు. అధిక శాతం చోరీకి గురైన వాహనాలు ఎక్కడున్నాయో కూడా తెలియడం లేదు. వాటిని కనుగొనడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సైకిల్ స్టాండ్‌ను వినియోగంలోకి తెచ్చి తమ వాహనాలకు రక్షణ కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. రైల్వే స్టేషన్‌లో తాగునీరు, మరుగుదొడ్ల వసతి కల్పించాలని కోరుతున్నారు.

5న 'పుట్టంరాజు'కు సన్మానం

ప్రజాశక్తి- అద్దంకి


శ్రీరామచంద్రమూర్తి

అద్దంకికి చెందిన ప్రముఖ సాహితీవేత్త పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి సాహిత్య విభాగంలో ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉగాది పురస్కారం- 2025 అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో గత నెల 30న నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా టూరిజం మరియు కల్చరల్ శాఖ మంత్రి కందుల దుర్గేష్, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి,సజనాత్మక మరియు సంస్కృతి సమితి అధ్యక్షురాలు పొడపాటి తేజస్విని సమక్షంలో శ్రీరామచంద్రమూర్తి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. అందులో భాగంగా సాహితీ కౌముది, రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ వారి ఆధ్వర్యంలో ఈ నెల 5న చిన్ని శాంతయ్య - పిచ్చమ్మ సేవాసదనంలో శ్రీరామ చంద్రమూర్తిని సన్మానించనున్నారు. పుట్టంరాజు సాహిత్య సేవారంగాల్లో విశేష కృషి చేస్తూ బహుగ్రంథకర్తగా, సాహితీ సేవకుడిగా పేరు గడించారు. బ్రాహ్మణ సంఘ అభివృద్ధికి తన స్వంత పొలం విక్రయించారు. అపరకర్మల సత్రం నిర్మాణం చేపట్టారు. విశ్రాంత ఉద్యోగుల భవనం నిర్మాణానికి చిన్నిమురళీకృష్ణ ద్వారా స్థలాన్ని ఉచితంగా ఇప్పించారు. తనవంతుగా లక్ష రూపాయల విరాళం అందజేశారు. విద్యాభివృద్ధిలో భాగంగా అనేక పాఠశాలలకు విద్యా సామగ్రి అందజేశారు. రోటరీ క్లబ్ కార్యదర్శిగా సేవలందించారు. తన పెన్షన్‌లో సింహభాగాన్ని సాహితీ కౌముది సంస్థ, పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మల ఛారిటబుల్ ట్రస్టు ద్వారా కవులు, కళాకారుల సన్మానానికి వినియోగిస్తున్నారు. పుట్టంరాజు సన్మాన సభలో సాహిత్య, సాంస్కృతిక, సేవా సంస్థల ప్రతినిధులు, సాహితీ ప్రియులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

మార్టూరులో నేత్రదానం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్


ఆంజనేయులు(ఫైల్)

మార్టూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త యక్కల ఆంజనేయులు(89) అనారోగ్య కారణాలతో గురువారం ఉదయం మతి చెందారు. ఆంజనేయులు గత 40 సంవత్సరాలుగా సుందరం టుబాకో కంపెనీలో క్యాషియర్‌గా పనిచేశారు. అనంతరం మార్టూరు మెయిన్ సెంటర్‌లో తమ కుమారుడు సత్య కుమార్ సహకారంతో ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తూ వ్యాపారవేత్తగా పేరు గడించారు. ఆయన గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందారు. ఆంజనేయులు మృతిపట్ల పలువురు వ్యాపారస్తులు, రాయల విద్యా సంస్థల కరస్పాండెంట్ పేరం రవీంద్రబాబు, కుడారి మధుబాబు, శ్రీనివాస విద్యా సంస్థల చైర్మన్ వీరగంధం శ్రీనివాస్ తదితరులు సంతాపం తెలిపారు.

బాపయ్య చొరవతో నేత్ర దానం

విశ్రాంత ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు రావుల బాపయ్య మృతుడు కుమారుడు సత్యకుమార్‌ను ఒప్పించి ఆంజనేయులు నేత్రాలను దానం చేయించారు. గుంటూరు జిల్లా కాకానిలోని శంకర్ నేత్రాలయం వైద్యులు ఆంజనేయులు కార్నియాలను సేకరించారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి -కారంచేడు

ఆటోలు, ఇతర వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని బాపట్ల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అంకమ్మరావు తెలిపారు. కారంచేడు గ్రామంలో గురువారం వాహన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓవర్ లోడింగ్ వాహనాలను, ఫిట్నెస్, ఇన్సూరెన్స్ లేని 3 ఆటోలను సీజ్ చేశారు. అనంతరం అంకమరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణించడం వల్ల కలిగే నష్టాల గురించి ప్రయాణికులకు వివరించారు. సీజ్ చేసిన వాహనాలను తదుపరి చర్యల నిమిత్తం కారంచేడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పాఠశాలకు ర్యాకు అందజేత

ప్రజాశక్తి - వేటపాలెం


పాఠశాలకు ర్యాకు అందజేస్తున్న దాత

మండల పరిధిలోని అక్కయ్య పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఫినిష్ సొసైటీ ప్రాజెక్టు ఫీల్డ్ వర్కర్ పి. రాజ పుస్తక ప్రదర్శనకు అనువైన ర్యాక్‌ను గురువారం అందజేశారు. స్మార్ట్ లైబ్రరీ ఏర్పాటు లో భాగంగా ఐటిసి అనుబంధ సంస్థ ఫినిష్ సొసైటీ చీరాల బ్రాంచి వారి ఆర్థిక సహకారంతో ఈర్యాక్ ను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల ఆర్థిక సహకారం ఇతోధికం గా ఉంటే ప్రతి పాఠశాలలో విద్యార్థుల విద్యాభివద్ధికి, పాఠశాల వసతుల కల్పనకు అవకాశం ఉంటుందన్నారు. లైబ్రరీ పుస్తకాలు ప్రతి చోట బీరువా లకే పరిమితం అవుతున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో లైబ్రరియన్ లేకపోవడం వల్ల వేల పుస్తకాలు నిరూపయోగం ఉన్నా యన్నారు. కళ్ల ముందు, తరగతి గదులలో పిల్లల ఎదురుగా కథల పుస్తకాలు కనిపిస్తే ప్రతి విద్యార్థిలో పఠనాశక్తి పెరుగు తుందన్నారు. ఫినిష్ సొసైటీ ప్రాజెక్ట్ ఫీల్డ్ వర్కర్ రాజ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచిగా ఎదగాలన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే సేవా గుణాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జయరావు, శ్రీనివాసుల రెడ్డి, అనురాధ, అంజమ్మ, డేటా ఎంట్రీ ఆపరేటర్ వై.వి.రమణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ వ్యర్థాలను వినియోగించాలి

వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ పి. ప్రసూనరాణి

ప్రజాశక్తి- బాపట్ల


వాన పాములు ఎరువును పరిశీలిస్తున్న మహిళా రైతులు

నేలలో భూసారం సజీవంగా ఉంటేనే మొక్కలు ఫలవంత మైన ప్రయో జనాన్ని అంది స్తాయని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ పి. ప్రసూన రాణి తెలిపారు. ఐసిఎఆర్ ఎస్‌టి సబ్‌ప్లాన్‌లో భాగంగా వ్యవసాయ వ్యర్థాల ప్రయోజనం గురించి వ్యవసాయ కళాశాల సేద్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సందర్శన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసూనరాణి మాట్లాడుతూ వ్యవసాయ వ్యర్థాలతో భూసారాన్ని పరిరక్షించుకోవచ్చునని తెలిపారు. నేలలో సూక్ష్మ జీవుల రక్షణతోనే మత్తిక జీవంతో పర్యావరణ సమతుల్యతను పరిరక్షించే దిశగా వ్యవసాయ వ్యర్థాలను పునర్వినియోగం జరగాలన్నారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులను చేపట్టేందుకు ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతులకు మేలు చేకూర్చే అనేక కార్యక్రమాలను చేపడు తుందన్నారు వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వర్మీకంపోస్టు, అజోల్లా పుట్టగొడుగుల పెంపకం యూనిట్ల సందర్శన ద్వారా ఆయా అంశాలపట్ల రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సేద్య విభాగాధిపతి కె.చంద్రశేఖర్, మత్తికా శాస్త్ర విభాగ అసోసియేట్ ప్రొఫెసర్, ఎస్‌సి సెల్ కోఆర్డినేటర్ ,కె.సుశీల, బి.సురేష్ కుమార్, అక్షయ్, వై.ఎర్రు నాయుడు, మౌనిక, బి.రాజ్యలక్ష్మి, రైతులు. విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి-బాపట్ల


సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ చేతుల మీదుగా గురు వారం అందజేశారు. బాపట్ల ప్యాడిసన్ పేటకు చెందిన మల్లెల సునీతకు రూ 2,00,804, చెట్టుపల్లి వందనంకు రూ89,022, దగ్గుమల్లి వారిపాలె కు చెందిన షేక్ కరీమునిసా కు రూ.70,000, ఉప్పం పాలెంకు చెందిన రాజు రాంబాబు ఒడ్డికి రూ.62,983, ఇమ్మడిశెట్టి వారి పాలెంకు చెందిన చాపల వెంకాయమ్మ కు రూ.51,311, కొత్తగడ్డ సూర్య కు రూ.40,000, చెక్కును నరేంద్ర వర్మ అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు గొలపల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంజమ్మకు ఎమ్మెల్యే ఏలూరి నివాళి

ప్రజాశక్తి-ఇంకొల్లు


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మాజీ జడ్‌పిటిసి, టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుంజి వెంకట్రావు మాతృ మూర్తి అంజమ్మ దశదిన కర్మ మండల పరిధిలోని పావులూరు గ్రామంలో గురు వారం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ పాల్గొని అంజమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళు లర్పించిన వారిలో టిడిపి కారంచేడు మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, తిరుమల శెట్టి శ్రీహరి, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రజక వృత్తిదారుల

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రకాశం జిల్లా కమిటీ పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఈ నెల 20, 21 తేదీల్లో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ఏడో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ప్రకాశం జిల్లా కమిటీ కోరింది. గురువారం నాడు స్థానిక ఎల్‌బిజి భవన్‌లో టంగుటూరు రాము అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి రాయల మాలకొండయ్య మాట్లాడుతూ జరిగిన మూడు సంవత్సరాల సమీక్షతో పాటు రాబోయే మూడు సంవత్సరాల ప్రణాళిక గురించి రాష్ట్ర మహాసభల్లో చర్చించడం జరుగుతుందని తెలిపారు.. గత 23 సంవత్సరాలు నుండి రాష్ట్ర వ్యాప్తంగా రజకులను సంఘటిత పరుస్తూ పలు సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహిస్తున్నా మని తెలిపారు. ఈ నేపథ్యంలో మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం ఒంగోలు నగరంలో విజయనగర కాలనీ, ఎన్జీవో కాలనీ, గణపతి నగర్ కాలనీ తదితరచోట్ల



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

రజక వృత్తిదారులను కలిసి మహాసభల కరపత్రాలు పంపిణీ చేశారు. మహాసభలకి ప్రకాశం జిల్లా రజక వత్తిదారులు హాజరై జయప్రదం చేయాలని జిల్లా కమిటీ కోరింది. అనంతరం మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఆవులమంద రమణమ్మ, డాక్టర్ కష్ణయ్య, చీమకుర్తి కోటేశ్వర రావు, సహాయ కార్యదర్శులు మంచికలపాటి శ్రీనివాసులు, చిట్యాల కొండయ్య, యోగమ్మ, పోలయ్య, యానాదిరావు, ఉప్పుగుండూరు శ్రీను, చీమకుర్తి శ్రీనివాసులు, అపార్ట్‌మెంట్ నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హక్కులకు భంగం కలిగిస్తే ఉద్యమం

- 8వ పిఆర్‌సి ప్రయోజనాలు అమలుచేయాలి..
- ధర్నాలో ఆల్ ఇండియా పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కేంద్ర ప్రభుత్వం 8వ పిఆర్‌సి ప్రయోజనాలు పెన్షనర్లందరికీ వర్తింపజేయాలని, పిఆర్‌సి అమలులో పాత పెన్షనర్లు, కొత్త పెన్షనర్లు వంటి వైరుధ్యాలను సష్టిస్తే సహించబోమని ఆల్‌ఇండియా పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ హెచ్చరించింది. రాజ్యాంగం కల్పించిన పెన్షన్ హక్కులకు భంగం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమని, ఉద్యమం చేపట్టవలసి వస్తుందని అసోసియేషన్ నాయకులు ప్రకటించారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా లక్షలాది మంది రైతులు చేపట్టిన ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమం చేపడదామని నేతలు పిలుపునిచ్చారు. నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎన్‌సిసిపిఏ) పిలుపులో భాగంగా గురువారం నాడు ఆల్‌ఇండియా పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రకాశం డివిజన్ బ్రాంచి ఆధ్వర్యంలో స్థానిక హెడ్ పోస్టాఫీస్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు సంఘం నేతలు మాట్లాడుతూ పెన్షన్ చెల్లింపులకు సవరణ చేయాలని కేంద్ర ప్రభుత్వం గత నెల 25న చర్చించడం పెన్షనర్లందరికీ శరాఘాతమని నేతలు పేర్కొన్నారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేకవిధానాలను తిప్పికొట్టాలని, పెన్షనర్లందరూ సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయచట్టాలకు వ్యతిరేకంగా లక్షలాదిమంది రైతులు చేపట్టిన ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమిద్దామని నాయకులు పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన పెన్షన్ హక్కుల పరిరక్షణకు పెన్షనర్లు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు అండగా నిలుస్తుందని, నిరసన కార్యక్రమానికి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సంఘం ప్రకాశం డివిజన్ ఉపాధ్యక్షులు డి.మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వీరాస్వామిరెడ్డి, రాష్ట్ర గౌరవాధ్యక్షులు, ప్రకాశం డివిజనల్ కార్యదర్శి పి.పేరయ్య, మహిళా విభాగం నాయకురాలు టి.వరలక్ష్మి మాట్లాడారు. అనంతరం మెయిల్ ద్వారా ప్రధాని నరేంద్ర మోడీకి మెమోరాండం పంపారు. కార్యక్రమంలో పలువురు పోస్టల్ ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

ఇంటర్నెట్ మార్పిడి విధానంపై మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గత ఐదేళ్లలో దేశం కోసం ఇంటర్నెట్ మార్పిడి విధానాన్ని అధికారికం చేయడానికి ప్రభుత్వ సర్వే/అధ్యయనం, అభివద్ధి, అధికారిక నియంత్రణ అథారిటీ ఏర్పాటుకు ట్రాయ్ ప్రతిపాదనల ఆమోదంపై ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర సమాచార, గ్రామీణాభివద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమాధానమిస్తూ ఇంటర్నెట్ మార్పిడి కేంద్రం ఒక భౌతిక స్థానమని, తద్వారా ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు, కంటెంట్ నెట్‌వర్క్, ఇతర ఇంటర్నెట్ మౌలిక సదుపాయాల కంపెనీలు తమ నెట్‌వర్క్‌ను కలుపుకొని ఇంటర్నెట్ ట్రాఫిక్ మార్పిడి చేసుకోవటానికి వీలవుతుందన్నారు. డేటా సెంటర్లను, కంటెంట్ డెలివరీ నెట్‌వర్క్, ఇంటర్ కనెక్ట్ ఎక్స్ఛేంజీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

5న బాబూజగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం ఈ నెల 5న ఒంగోలులో జరుగుతుందని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎం.లక్ష్మానాయక్ తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా ఈనెల 5న ఉదయం 10 గంటలకు నెల్లూరు బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ భవన్‌లో పోవు దారిలోని డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. ఉదయం 10.30 గంటలకు అంబేద్కర్ భవన్‌లో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సభ జరుగుందన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, షెడ్యూల్డ్ కులాలు, తెగల సంఘ నాయకులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఖాళీ బిందెలతో నిరసన ర్యాలీ

- మౌలిక వసతుల కల్పన పట్ల పాలకుల నిర్లక్ష్యం
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి
- మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న జివి.కొండారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం విడనాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి డిమాండ్ చేశారు. సిపిఎం కనిగిరి పట్టణ కార్యదర్శి పిసికేశవరావు అధ్యక్షతన మహిళలు ఖాళీ బిందెలతో గురువారం పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ధర్నానుద్దేశించి కొండారెడ్డి మాట్లాడుతూ నీటి సమస్యతో పాటు ఇంటి స్థలాల సమస్య, మౌలిక వసతుల కొరతతో 20 వార్డులలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. శివారు ప్రాంతాల్లో మరీ ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని, టిడ్కో గహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలుపుకోవాలని కోరారు. సిపిఎం శ్రేణులు 20 వార్డులలో ప్రజా చైతన్య యాత్రను నిర్వహించి.. ప్రజల సమస్యలను సర్వే ద్వారా సేకరించడం జరిగిందని తెలిపారు. 20 వార్డుల నుంచి ప్రజలు తమ సమస్యలతో కూడిన అర్జీలను అధికారులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. వాటిని నిర్దిష్టమైన వ్యవధిలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యవైఖరి విడనాడకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కమిషనర్ డానియల్ జోసెఫ్‌కు వినతిపత్రాలను అందజేశారు. తమ పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని, మిగిలిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్కే బషీర, ప్రసన్న, నరేంద్ర, పిచ్చయ్య, ఏడుకొండలు, ఆదిలక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.



అరుణను సత్కరిస్తున్న దృశ్యం

పురస్కార గ్రహీతలకు సత్కారం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రాష్ట్రప్రభుత్వం ద్వారా ఉగాది పురస్కారాలను అందుకున్న నరసం (నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం) గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ, కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావులను పలువురు సత్కరించారు. బుధవారం రాత్రి స్థానిక గాయత్రి గ్రామర్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో వారిని ఆ స్కూల్ నిర్వాహకులు రామలక్ష్మి, నారాయణ పబ్లిక్ స్కూల్ నిర్వాహకులు కొల్లా సౌజన్య సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ జగదీష్, జ్యోతిర్మయి, సిబ్బంది పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు రూడ్‌సెట్ సంస్థలో ఏప్రిల్ 11 నుంచి 30 రోజుల పాటు ఉమెన్స్‌కు టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ శిక్షణకు ఉమ్మడి ఒంగోలు జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెంది ఉండి.. ఆధార్ కార్డ్, రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి ఉచితంగా కల్పించబడునని తెలిపారు. మరిన్ని వివరాలకు, నమోదు కోసం 8309915577 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి3 పరిధిలోని సౌత్ బైపాస్‌రోడ్డు, కొత్తడొంక, 220 కెవి సబ్ స్టేషన్, కొత్త మార్కెట్ తదితర ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్తు సరఫరా అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డిఈఈ కె.వి.పాండురంగారావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి.. సహకరించాలని కోరారు.

గాజాపై వైమానిక దాడులు ఆపాలి

సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

గాజాపై ఇజ్రాయిల్ వైమానిక దాడులను ఆపాలని సిపిఎం డిమాండ్ చేసింది. గురువారం నాడు నగరంలోని గాంధీ సెంటర్లో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో గాజాపై ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ జరిగిన కార్యక్రమంలో నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ అంతర్జాతీయ సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఐక్యరాజ్యసమితి మాట ను లెక్కచేయక ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంతో దాడులతో విరుచుకుపడుతోందన్నారు. ఇప్పటి వరకు 17 శాతం భూభాగాన్ని ఆక్రమించుకుందని, ఇది ముమ్మాటికి దురాక్రమణ చర్య అని వారు దుయ్యబట్టారు. సీనియర్ నాయకులు యస్. డి. యాసిన్ మాట్లాడుతూ గత 31 రోజులుగా గాజాకు నిత్యావసరాల సరఫరా నిలిచిపోయిన ఫలితంగా గాజాలోని బేకరీలు మూతపడ్డా యని, ఈ చర్యల వల్ల పాలస్తీనియన్లు అందరూ ఉమ్మడిగా శిక్షను అనుభవించాల్సి వస్తోందని నెల రోజులుగా ఒక్క వాణిజ్య ట్రక్కు కూడా లోపలకు రాలేదని తెలిపారు. నగర కార్యదర్శివర్గ సభ్యులు తంబి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి.రఘురామ్, ఒంగోలు నగర నాయకులు టి.మహేష్, బి.వి.రావు, పీరుసాహెబ్, టి సురేష్, రావూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రైవేటు అధ్యాపకులకు

12 నెలలకూ వేతనం ఇవ్వాలి

డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థలలో పని చేస్తున్న అధ్యాపకులకు 12 నెలలకూ వేతనం చెల్లించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి కె.ఎఫ్. బాబు డిమాండ్ చేశారు. గురువారం నాడు ఎల్బీజీ భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థల యాజమాన్యాలు అందులో పని చేస్తు న్న అధ్యాపకులతో వెట్టిచాకిరీ చేయించు కుంటున్నాయని, శ్రమకు తగ్గ వేతనం లేక ప్రైవేటు ఉపాధ్యాయులు సతమతమవుతున్నారని పేర్కొన్నారు. కేవలం 10 నెలల వేతనం ఇచ్చి సరిపెడుతున్నారని,



మాట్లాడుతున్న కెఎఫ్.బాబు

పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ర్యాంకులు రావాలన్నా, స్కూల్స్, కాలేజీలలో అడ్మిషన్‌లు పెరగాలన్నా కీలక భూమిక అందులో పని చేస్తున్న సిబ్బందిదే అన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, కనీ సం ఉద్యోగ భద్రత కూడా లేకుండా సంవ త్సరాల తరబడి పాఠశాల అభివద్ధి కోసం పని చేస్తూ ఉన్నప్పటికీ గుర్తింపు లేదన్నారు. సమావేశంలో నగర అధ్యక్షులు పి కిరణ్, నవీన్ పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఆంధ్ర కేసరి యూనివర్శిటీ త నిర్వహిస్తున్న నాల్గవ సెమిస్టర్ పరీక్షల ఆకస్మిక తనిఖీలలో భాగంగా మార్టూరు లోని పరీక్షా కేంద్రాన్ని ఆంధ్ర కేసరి యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి హరిబాబు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రశాంత వాతావరణంలో సజావుగా, సక్రమంగా పరీక్షలు నిర్వహిస్తూ ఉండటం పట్ల హరిబాబు సంతప్తిని వ్యక్తం చేశారు.

కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష తేదీ ప్రకటించాలి

డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కెవి పిచ్చయ్య

ప్రజాశక్తి - దర్శి

రాష్ట్ర ప్రభుత్వం కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించకుండా నిర్లక్ష్యం వహిస్తుందని, పరీక్షల తేదీ ప్రకటించకుంటే నిరుద్యోగుల పక్షాన డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఛలో విజయవాడకు పిలుపు ఇస్తామని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కెవి పిచ్చయ్య తెలిపారు. కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షల తేదీ ప్రకటించాలని కోరుతూ స్థానిక సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కానిస్టేబుల్ అభ్యర్థుల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, అభ్యర్థులకు అరచేతిలో వైకుంఠం చూపిస్తుందని అన్నారు. గత ప్రభుత్వం హయంలో 2022లో నోటిఫికేషన్ ఇచ్చి మూడేళ్ల అవుతున్నా ఇంతవరకు కానిస్టేబుల్ పరీక్షలు నిర్వహించి పోస్టులు భర్తీ చేయలేదని అన్నారు. ప్రతిపక్షంలో వుండగా యువగళంలో నారా లోకేష్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కోర్టు కేసులు క్లియర్ చేసి పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్న ఇంతవరకు అతీగతీ లేదన్నారు. మాది మంచి ప్రభుత్వమని చెప్పుకోవడం కాదని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చినప్పుడే మంచి ప్రభుత్వం అవుతుందని, లేకుంటే ముంచే ప్రభుత్వం అవుతుందని అన్నారు. తక్షణమే సుప్రీం కోర్టులో కేసులు పరిష్కరించి పాత పద్ధతిలో రిజర్వేషన్ నిర్వహించి కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్ష తేదీ ప్రకటించాలని అన్నారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేసి చలో విజయవాడ పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు ఆర్‌జెసి పాల్, నాయకులు షేక్ పీరా సాహెబ్, కళ్యాణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కెవి పిచ్చయ్య

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బ్రహ్మయ్య

ప్రజాశక్తి - దొనకొండ


బత్తుల బ్రహ్మయ్య

జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా ఎర్రబాలెం గ్రామంకు చెందిన బత్తుల బ్రహ్మయ్య యాదవ్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి యలగాల నూకానమ్మ, రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు వై నాగేశ్వరరావుయాదవ్ నుండి ఉత్తర్వులు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి బిసిల సమస్యల పరిష్కారంకు బాధ్యతగా పనిచేస్తానని చెప్పఆరు. ప్రభుత్వ పరంగా అందాల్సిన సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకునేలా తమవంతు కృషి చేస్తానని వివరించారు.


డిటి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇస్తున్న దళిత నాయకులు

దళితుల భూములు కాజేసిన పెత్తందారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-దర్శి

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వరరావుకు రాష్ట్ర దళిత సేన ఆధ్వర్యంలో దళితుల భూమిని దళితులకు ఇప్పించండి అంటూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రదళితసేన అధ్యక్షుడు గర్నిపూడి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని తూర్పుచౌటపాలెం ఎస్సీ (మాలపల్లి) గ్రామానికి చెందిన దాసరి పాపయ్య తండ్రి ఏలియాకు సంబంధించి ప్రభుత్వ సాగు భూమిని సుమారు 50ఏళ్ల నుండి గ్రామ సర్వేనెంబర్ 60/6లో 0.25సెంట్లు భూమిని అదే గ్రామానికి చెందిన పెత్తనదారుడు ఆక్రమించాడు. దళితుల భూములను ఆక్రమించిన పెత్తనదారులపై తక్షణ చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితుల భూములు దళితులకు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో దళిత సేన నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రాచపూడి మోషే, కంభంపాటి సన్నీబాబు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్స్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - దొనకొండ


అధ్యక్షుడు బి కేశవ

ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్స్ సంఘం ఎన్నికను స్థానిక ఉపాధి పథకం కార్యాలయంలో నూతన కమిటీ గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మీపురం ఫీల్డ్ అసిస్టెంట్ వి కేశవ, ఉపాధ్యక్షుడిగా ఇంద్లచెరువు ఫీల్డ్ అసిస్టెంట్ బాలయ్య, కార్యదర్శిగా తెల్లబాడు ఫీల్డ్ అసిస్టెంట్ బి సత్యనారాయణరెడ్డి, మరికొందరు సభ్యులతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్స్ సమస్యల పరిష్కారంకు బాధ్యతగా పనిచేస్తామని పేర్కొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి - కనిగిరి

పట్టణ పోలీసు స్టేషన్‌లో ఎస్పీ ఎఆర్ దామోదర్‌ను మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పట్టణంలో ట్రాఫిక్ సమస్యలపై ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. రోజురోజుకు ట్రాఫిక్ సమస్య ఎక్కువ అవుతుందని, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అదనపు సిబ్బందిని నియమించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎస్పీ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో న్యాయవాది షేక్ సుభైయిర్ పాల్గొన్నారు.

నట్టేట ముంచిన నకిలీ విత్తనాలు


కొండ బోయినపల్లిలో సాగుచేసిన మొక్కజొన్న పంట

ప్రజాశక్తి-సిఎస్.పురం

దళారుల మాటలు నమ్మి మొక్కజొన్న రైతులు మోస పోయారు. సాగు చేసి నాలుగు నెలలైనా కంకిదశకు వచ్చే టప్పటికి గింజ రాక పూర్తిగా నష్టపోయామని రైతులు నావేదన వ్యక్తం చేస్తున్నారు. తీరా చూస్తే అవి నకిలీ విత్తనాలు కావడంతో పంట పండక పూర్తిగా నష్టపోయామని మండలంలోని కొండ బోయినపల్లి గ్రామానికి చెందిన మల్లె నాగార్జున, గోరింటపల్లి గ్రామని చెందిన ఎం సుబ్బారావు, మాల కొండయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కొండ్రాజుపల్లి గ్రామానికి చెందిన మల్లే నాగార్జున తమ సొంత భూమిలో 3.50ఎకరాలు, గోరింటపల్లి గ్రామానికి చెందిన ఎం సుబ్బారావు, మాల కొండయ్య గోరింటపల్లి గ్రామానికి చెందిన చింతం ఆవులయ్య దగ్గర 10ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న వేశారు. బేస్తవారిపేట మండలం సింగసానిపల్లి గ్రామానికి చెందిన మండ్ల రామయ్య ద్వారా లక్ష్మీ ప్రసన్న సీడ్స్ కంపెనీకి చెందిన ఏజెంట్ నారాయణ నాలుగు నెలల క్రితం మొక్కజొన్న విత్తనాలు సరఫరా చేశారు. కంపెనీ వారు ఎకరాకు 30క్వింటాలు పండుతాయని, వాటిని మరలా కంపెనీవారే టన్నుకు రూ.26వేలకు కొనుగోలు చేస్తామని చెప్పారని తెలిపారు. పెట్టుబడి సహాయంగా కంపెనీవారే ఎకరాకు కొంత డబ్బులు, పురుగు మందులు సరఫరా చేశారని అన్నారు. తాము ఐదు నెలలు కష్టపడి పంట పండించగా దిగుబడి రాలేదని రైతులు వాపోయారు. ప్రతి ఎకరాకు రూ.50వేలు ఖర్చు అయిందని, కంకి దశకు వచ్చేటప్పటికి గింజలు రాలేదని రైతులు తెలిపారు. ఈ విషయమై విత్తనాలు సరఫరా చేసిన విత్తన కంపెనీ యజమాని నారాయణతో మాట్లాడగా తాము ఇచ్చిన విత్తనాల్లో ఎటువంటి లోపం లేదని, దిక్కు ఉన్నచోట చెప్పుకోండని అంటున్నారని వాపోయారు. ఈ సందర్భంగా రైతు మల్లే నాగార్జున మాట్లాడుతూ మధ్యవర్తి రామయ్య ద్వారా ఏజెంటు నారాయణ తమ గ్రామానికి వచ్చి లక్ష్మీ ప్రసన్న సీడ్స్ కంపెనీ గురించి చెప్పి మొక్కజొన్న సాగు చేసుకునేటట్లు చెప్పి ఎకరాకు రూ.20వేలు పెట్టుబడి సాయం కింద ఇస్తామని చెప్పి రూ.10వేలు మాత్రమే ఇచ్చారని తెలిపారు. పంట దిగుబడి రాకపోతే ఒక ఎకరాకు రూ.40వేలు ఇస్తామని చెప్పి, పంట బాగా పండిన ట్లయితే ఒక టన్ను రూ.30 వేలకు కొనుగోలు చేస్తామని చెప్పి తమను మోసం చేశారని తెలిపారు. నాలుగు నెలల నుండి సాగు చేస్తూ మొక్కజొన్న ఏపుగా పెరిగి కంకి దశకు వచ్చే సరికి మొక్కజొన్న కంకులకు విత్తనాలు రాలేదని, ఒట్టి కంకులు మాత్రమే దర్శనమిస్తున్నాయని వాపోయారు. వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించగా కంపెనీ వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పినట్లు రైతులు తెలిపారు. మధ్యవర్తి రామయ్య పంట రాకపోతే నష్టపరిహారం కంపెనీ ద్వారా ఇప్పించే బాధ్యత తనదని అగ్రీ రూపంలో వ్రాసి వ్రాత పూర్వకంగా సంతకం చేసి ఇచ్చారని అన్నారు. లక్ష్మీ ప్రసన్న సీడ్స్ కంపెనీ ఏజెంట్ నారాయణను పరిచయం చేసిన రామయ్య తాను ఏం చేయలేనని, ఏజెంట్ నారాయణ మీద చర్య తీసుకోండని తప్పుకుంటున్నారని తెలిపారు. మండలంలోని విభైలు గ్రామంలో ఇదే పరిస్థితి నెలకొంది. గ్రామంలో 30 ఎకరాల వరకు మొక్కజొన్న పంట సాగు చేశారు. కడప జిల్లా పోరుమామిళ్ల మండలానికి చెందిన కొందరు ఏజెంట్లు మొక్కజొన్న విత్తనాలు ఇచ్చారని గ్రామానికి చెందిన రైతు సారె వెంకటసుబ్బయ్య, జమకాల ఉసేనయ్య, మరికొందరు రైతులు తెలిపారు. ఎకరాకు మూడు టన్నుల వరకు దిగుబడి వస్తుందని ఏజెంట్ చెప్పినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం ఒక్క టన్నుకూడా దిగుబడి వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. కంకి దశకు వచ్చేటప్పటికి పూర్తిగా గింజ పట్టకుండా పోయిందని తెలిపారు. పెట్టుబడి, కూలీల ఖర్చు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ఈ విషయంపై కొండ బోయినపల్లి రైతులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై చర్యలు తీసుకొని తమకు నష్టపరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.


గింజలు రాని మొక్కజొన్న కండెలు చూపుతున్న రైతులు నాగార్జున, హుస్సేనయ్య


ఎల్‌ఒసి అందజేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

సిఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఒసి అందజేత

ప్రజాశక్తి-దర్శి

మండలంలోని పోతవరం గ్రామానికి చెందిన తోట రమణమ్మ అనే మహిళకు అనారోగ్యం కారణంగా ఆపరేషన్ అవసరమని టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ దృష్టికి తీసుకురాగా ఆమె వెంటనే స్పందించి ముఖ్యమంత్రి కార్యాలయానికి తెలియజేశారు. రూ.2,18,600 ఎల్‌ఒసి తెప్పించి బుధవారం దర్శిలోని డాక్టర్ లక్ష్మీ నివాసంలో ఆమె కుంటుంబసభ్యులకు గురువారం అందజేశారు. డాక్టర్ లక్ష్మీతో పాటు పోతవరం గ్రామ నాయకులు గోపిశెట్టి నారాయణ, కోరే రంగసాయి, కొండలు, టిడిపి నాయకులు దారం సుబ్బారావు, సానే సుబ్బయ్య ఉన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి

వైసిపి ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభ

ప్రజాశక్తి-దర్శి

మండలంలోని శామంతపూడి గ్రామంలో ఆంజనేయ స్వామి తిరునాళ్ళ సందర్భంగా వైసిపి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసిపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. బుధవారం రాత్రి జరిగిన తిరునాలలో వైసీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభపై మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి శుభం దుర్గారెడ్డి, అమర మురళి, పమిడి కొండయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు

దర్శి : మండలంలోని శామంతపూడి గ్రామంలో బుధవారం జరిగిన ఆంజనేయ స్వామి తిరునాల సందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. తెలుగుదేశం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు మాట్లాడుతూ ఆంజనేయస్వామి కరుణ కటాక్షం అందరికీ కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు కామిరెడ్డి వెలుగొండారెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధి ఛాంబర్‌లో ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ గారిచే అందరు ప్రోగ్రాం అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ గురువారం నిర్వహించారు. ప్రోగ్రాం అధికారులకు. రాష్ట్రములో అమలు అవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్కూల్ పిల్లల ఆరోగ్య పరీక్షలు, వేసవి కాలంలో వచ్చు వ్యాధుల నుండి కాపాడుకొనుట, సికిల్ సెల్ అనీమియా, ఈ కాంఫరెన్స్‌లో ఆబ ఐ.డి జనరేషన్ పి.యమ్.జె.ఎ.వై. 3.0 యాన్.సి.డి. స్క్రీనింగ్ మరియు వడగాల్పులపై తీసుకొనవలసిన ముందు జాగ్రత్తల చర్యలు గురించి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమములో డిఎంహెచ్ఒ డాక్టర్ టి. వెంకటేశ్వర్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ ధికారి.డాక్టర్ పి. పద్మజ ఇమ్యునే జేషన్ అధికారి . డాక్టర్ సౌజన్య డి.పి.యమ్.ఓ. డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ శ్రవణ్, డాక్టర్ హేమంత్, చల్ల ప్రభాకర్ రెడ్డి డేటా మేనేజర్, మొదలగు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వీడ్కోలు

ప్రజాశక్తి-వేటపాలెం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ అఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి కళాశాలలో బిటెక్ (ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్ ్సవిభాగం) ఆఖరి సంవత్స రం చదువుతున్న విద్యార్థులకు ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి) విభాగం విద్యార్థులు గురువారం వీడ్కోలు సభ నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకష్ణా రావు, కరస్పాండెంట్ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కె. జగదీశ్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల సడల కుండా తమ శక్తి యుక్తులను ధారపోసి లక్ష్య సాధనకు తీవ్ర కషి చేయాలన్నారు. విద్యార్థులు ఆధునిక టెక్నాలజీలపై దష్టిని సారించాలనానరు. ఐఒటి విభాగాధిపతి యస్.ఇంద్రనీల్ మాట్లాడుతూ స్మార్ట్ టెక్నాలజీలు, టెక్నాలజీలతో అనుబంధం చేసి విద్యార్థులు సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్ విభాగం మూడవ సంవత్సరం విద్యార్థులు ఆఖరి సంవత్సరం విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్ర మాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో సి.ఎస్‌రావు డైరక్టర్ (అక్రిడిటేషన్స్), అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వి. రమణమూర్తి , వివిధ విభాగాధిపతులు, అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిడిపిఒ సుధ

సమయపాలన పాటించాలి : సిడిపిఒ

ప్రజాశక్తి- సంతమాగులూరు

అంగన్‌వాడీలు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సిడిపిఒ డి.సుధ తెలిపారు. సంతమాగులూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని బల్లికురవ, సంతమాగులూరు మండలాల అంగన్ వాడీలతో స్థానిక కళ్యాణ మండపంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకూ అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలన్నారు. పిల్లల సంరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫి నాయిల్, చాకులు, మందులు వంటివి పిల్లలకు అందుబాటులో లేకుండా చూసుకోవాలన్నారు. బాల సంజీవిని యాప్‌లో ప్రతిరోజూ ఇన్ మరియు అవుట్ హాజరు వేయాలన్నారు. ప్రతిరోజు సెంటర్ ను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆకుకూరలు ఎలా కడగాలి, గుడ్లు ఎంత సేపు ఉడకబెట్టాలి, వాటిలోని పోషక విలువలు పోకుండా ఎలా పిల్లలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు మేరాబి, సుష్మా రాణి, ప్రమీల, విజయనిర్మలపాల్గొన్నారు.

శ్మశాన వాటికకు దారి చూపాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి బాపట్ల

బాటప్ల పట్టణంలోని ఆనంద నగర్ దళిత క్రైస్తవ శ్మశాన వాటిక రహదారికి స్థలం మంజూరు చేయాలని కోరుతూ దళిత సంఘాలు జిల్లా కలెక్టర్ వెంకట మురళికి గురువారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా అంటరానితన నిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులడు జి. చార్వాక మాట్లాడుతూ ఆనంద నగర్ దళితులకు గత 50 యేళ్ళ క్రితం సూర్యలంక బైపాస్ పక్కన 35 సెంట్ల స్థలాన్ని శ్మశాన వాటిక కోసం కేటాయించినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఆనంద నగర్ దళితులు దళిత క్రైస్తవులు ఎవరైనా మృతి చెందితే సాంప్రదాయ బద్ధంగా ఆ స్థలంలోనే ఖననం చేసుకుంటున్నట్లు తెలిపారు. ఆనంద నగర్ లో జనాభా పెరగడంతో శ్మశాన వాటిక సరిపోవడం లేదని తెలిపారు. బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయడంతో శ్మశాన వాటికకు వెళ్లేందుకు మార్గం లేకుండా పోయినట్లు తెలిపారు. శ్మశాన వాటిక భూమి కొంత మేర ఆక్రమణకు గురైనట్లు తెలిపారు. ఫలితంగా శ్మశాన వాటికలోకి వెళ్లేందుకు రహదారి లేకుండా పోయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోజన్ బాబు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎజిపిగా గొట్టిపాటి నాగేశ్వరరావు



ప్రజాశక్తి రేపల్లె : రేపల్లె సివిల్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా సీనియర్ న్యాయ వాది గొట్టిపాటి వెంకటేశ్వర రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. రేపల్లె మండలం కారుమూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వర రావు 2006 నుంచి న్యాయవాదిగా రేపల్లె బార్ అసోసియేషన్‌లో ప్రాక్టీస్ చేస్తున్నారు. ఏజీపీగా బాధ్యతలు వెంకటేశ్వరరావును న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు అభినందించారు.

సాధారణ కాన్పులపై అవగాహన

ప్రజాశక్తి- అద్దంకి : సాధారణ కాన్పులను ప్రోత్సహించాలని స్థానిక ప్రభుత్వ వైద్యులు వాహిలా చౌదరి తెలిపారు. అద్దంకి సామాజిక ఆరోగ్య కేంద్రంలో కాన్పులపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాహిలా చౌదరి మాట్లాడుతూ సాధారణ కాన్పుల వల్ల తల్లి బిడ్డ క్షేమంగా ఉండేఅవకాశాలు ఉన్నాయన్నారు. తల్లి తొందరగా కోలుకోవచ్చనని తెలిపారు. ఆపరేషన్ చేసి బిడ్డను తీస్తే అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. గర్భిణులు సాధారణ కాన్పుల వైపు మొగ్గు చూపే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - రేపల్లె : న్యాయ సేవాధికార సంస్థ పరిధిలోని పారా లీగల్ వాలంటీర్లు ఇటు న్యాయస్థానానికి ... అటు కక్షిదారులకు వారధిగా నిస్వార్థంగా పనిచేయాలని రేపల్లె కోర్టు సీనియర్ సివిల్ జడ్జ్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక న్యాయస్థానం ప్రాంగణంలో మండల న్యాయ సేవాధికార సంస్థ పరిధిలో ఎంపికైన పిఎల్‌విలకు చట్టాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉచిత న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు లీగల్ వాలంటీర్లు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది ఆచారి పారా లీగల్ వాలంటీర్లు నాగమల్లేశ్వరరావు శ్రీనివాసరావు తాహిర్ అహ్మద్, ఎం నాగమల్లేశ్వరరావు. ఆలా మోషే డి.చిన్న యానాదిరావు పాల్గొన్నారు.

నేడు సైకిళ్ల పంపిణీ

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి పట్టణంలోని శ్రీ ప్రకాశం బాలిక ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు గురువారం సైకిళ్లు పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి. రవీంద్ర తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముఖ్యఅతిథి హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ప్రజావేదిక కార్యక్ర మాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

ముస్లిములపై కుట్రలో భాగమే వక్ఫ్ సవరణ బిల్లు

వైసిపి బాపట్ల జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షులు నసిరున్నిసా బేగ్

ప్రజాశక్తి - రేపల్లె



మాట్లాడుతున్న ససిరున్నీషా బేగ్

ముస్లింలపై కుట్రలో భాగమే వక్ఫ్ సవరణ బిల్లు అని వైసిపి బాపట్ల జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షులు నసిరున్నిసా బేగ్ తెలిపారు. భారతదేశానికి బుధవారం చీకటి రోజు అని ఆయన పేర్కొన్నారు. వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఈవూరి గణేష్‌తో కలిసి గురువారం విలేకర్ల సమాశం నిర్వహించారు. ఈ సందర్భంగా నసిరున్నిసా బేగ్ మాట్లాడుతూ బిజెపి గద్దెనెక్కినప్పటి నుంచి కక్షపూరితమైన నల్ల చట్టాలను ప్రవేశపెట్టి ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తున్నదని ఆరోపించారు. ముస్లింలపై కుట్రలో భాగంగానే వక్ఫ్ సవరణ బిల్లుకు పూనున్నట్లు తెలిపారు. రాజ్యాంగం లోని ఆర్టికల్ 14 ఆర్టికల్ 25, 26 ను అపహస్యం చేస్తూ మతపరమైనటువంటి బిల్లులను ప్రవేశపెట్టి ఇతర మతాచారాలలో వేరొకరి ప్రమేయాన్ని ప్రవేశపెట్టి ముస్లింల ఆస్తులను దోచుకునే ప్రయత్నం వక్ఫ్ సవరణ బిల్లు అని తెలిపారు. భారతదేశం అన్ని మతాల సంస్కతుల సమ్మేళనమని, అలాంటి సంస్కతిని విచ్ఛిన్నం చేయడం కోసమే మత విద్వేషకరమైన చట్టాలను ప్రవేశపెట్టి అన్నదమ్ముల్లా కలిసి ఉండేటటువంటి వారి మధ్య శత్రుత్వం పెంచేందుకు చూడటం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగం పై దాడిగా ఆయన పేర్కొన్నారు. వక్ఫ్ నల్ల చట్టాన్ని వెనక్కి తీసుకోకపోతే ప్రజా ఆగ్రహాన్ని చూడాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లియాకత్ బాషా, అబ్దుల్ కుద్దూస్, గౌస్, ఖాదర్ రఫీ, బాజీ పాల్గొన్నారు

భూముల రీసర్వేపై అవగాహన

ప్రజాశక్తి -యద్దనపూడి



మాట్లాడుతున్న ఆర్‌డిఒ గ్లోరియా

మండల పరిధిలోని యనమదల, పోలూరు గ్రామాలలో భూముల రీ సర్వేను గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామసభ నిర్వహించారు. సభలో ఆర్‌డిఒ పి. గ్లోరియా మాట్లాడుతూ రీసర్వేను జాగ్రత్తగా చేపట్టాలన్నారు. భూ సమస్యలు మళ్లీ రాకుండా చూడాలన్నారు. అనంతరం భూసర్వేపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు రవికుమార్,మండల సర్వేయర్ సాంబశివరావు,రీసర్వే డిటీ విష్ణు, సీనియర్ అసిస్టెంట్ భాస్కరరావు, గ్రామ సర్వేయర్ లిల్లీ గ్లోరీ, గ్రామ నాయకులు ఆర్. సీతయ్య, భద్రయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు : భూముల రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు పి.బ్రహ్మయ్య తెలిపారు. మండల పరిధిలోని నూతలపాడు గ్రామంలో రీసర్వేపై అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ నిర్వహించారు. రైతులకు రీ సర్వే పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లా డుతూ భూముల రీ సర్వే సమయంలో రైతులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. రైతులు తమ పొలాలకు సంబంధించిన ఆధారాలు తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పి. బ్రహ్మయ్య , రీ సర్వే డిటీ అరుణ, సర్పంచి కె. చిన్నయ్య మండల సర్వేయర్ బాలాంజనేయులు, ఆర్ఐ ప్రేమ్ కుమార్, విన్నకోట సతీష్, విఆర్‌ఒలు, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తులు అందజేత

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలో పారిశుధ్యం మెరుగుదలకు కార్మికులు కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ తెలిపారు. పురపాలక సంఘంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు గురువారం దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మంగ మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ కార్మికులకు దుస్తులు అందజేసే విషయంలో అన్ని మున్సిపాలిటీలలో కన్నా రేపల్లె ముందున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ టి. కాశీ విశ్వనాధ గుప్త, జి. ప్రశాంత్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, కె. సుబ్బారావు, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

దేశభక్తి కలిగి ఉండాలి

ప్రజాశక్తి- సంతమాగులూరు

విద్యార్థులు ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండి ధైర్యం, క్రమశిక్షణతో మెలిగి తోటి వారికి సేవ, సహాయం చేయాలని ఏల్చూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దారా బాలయ్య తెలిపారు. ప్రధాన మంత్రి యోజన పథకంలో భాగంగా పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రూప్ బృందాలను గురువారం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా బెడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బెడెన్ పావెల్ చేసిన కషి గురించి విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్కౌట్స్ మాస్టర్ వీరేంద్ర, ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, మూర్తయ్య, వెంకటేశ్వర్లు, గోపీనాథ్ . విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల గృహ సందర్శన

ప్రజాశక్తి -అద్దంకి

మండలంలోని తిమ్మాయపాలెం ఎస్‌సి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు తమ హాబిటేషన్ పరిధిలోని గృహాలను గురువారం సందర్శించారు. ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి బిడ్డను తమ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న బోధన గురించి గురించి వారికి వివరించారు. ప్రైవేటు పాఠశాల విద్య బోధన కన్నా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన బాగుంటున్నట్లు తెలిపారు. పాఠశాలో చదువుతున్న విద్యార్థుల యొక్క సామర్థ్యాల గురించి వారికి వివరించారు. ప్రభుత్వ పాఠశాల్లో ఉచితంగా పాఠ్య పుస్తకాలు, బూట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవి.రమణా రెడ్డి, ఉపాధ్యాయులు, సిఆర్‌పి ఎం. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుకు కృషి

కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహానికి ఏర్పాటుకు కృషి చేస్తామని ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు హామీ ఇచ్చారు. గత నెల 29న ఒంగోలు నగరం క్లొపేట వద్ద ఉన్న మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని రోడ్డుకు అడ్డంగా ఉందని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు జెసిబిలతో కూల్చివేశారు. ఈ చర్యను ఖండిస్తూ ఒంగోలు నగర కాంగ్రెస్ అధ్యక్షురాలు తురకపల్లి నాగలక్ష్మి ఆధ్వర్యంలో పార్టీ నేతలు ఒంగోలు మున్సిపల్ కమిషనర్ కోడూరి వెంకటేశ్వరరావును గురువారం కలిశారు. ఈ సందర్భంగా తురకపల్లి నాగలక్ష్మి మాట్లాడుతూ దేశ అభివృద్ధికి, సమగ్రతకు, సమైక్యతకు తన ప్రాణాన్ని పణంగా పెట్టిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని అవమానించటం తగదన్నారు. ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ మే 21 రాజీవ్ గాంధీ వర్ధంతి లోపు ప్రభుత్వ ఖర్చులతో ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కి వినతిపత్రం అందజేశారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నగర కాంగ్రెస్ అధ్యక్షురాలు నాగలక్ష్మి, పార్టీ నేతలతో కలసి క్లొపేటలో విగ్రహం ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ చైర్మన్ కైపు వెంకటకష్ణారెడ్డి, సంతనూతలపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ పాలపర్తి విజేష్ రాజ్, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు మన్నం ప్రసన్నరాజు, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దాసరిసతీష్, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు సుధీర్ వర్మ, శ్రీను, ఎస్‌కె రసూల్ పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

విహారయాత్రలకు వెళ్లేటప్పుడు..

విలువైన వస్తువులను భద్రపరుచుకోవాలి

- పోలీసులకు సమాచారం ఇస్తే ఆ ఇంటిపై నిరంతర నిఘా
- ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

తాత్కాలికంగా ఇంటికి తాళాలు వేసి విహార యాత్రలు, తీర్ధయాత్రలకు ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమాచారం ఇచ్చి వెళ్లాలని ఎస్పీ తుషార్‌డూడీ జిల్లా ప్రజలకు తెలిపారు. వేసవి సెలవులను ఆసరాగా చేసుకొని తాళం వేసిన ఇళ్లలో జరిగే దొంగతనాలను అరికట్టేందుకు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని గురువారం సూచించారు. సమాచారం ఇవ్వడం వల్ల ఆ ఇంటిపై నిరంతర పోలీస్ నిఘాను ఉంచడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆ ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను సమర్ధవంతంగా నిర్వహిస్తూ నిఘాను పటిష్టం చేస్తామన్నారు. దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంచుకుని ఎక్కువగా దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. విహార యాత్రలకు వెళ్లేవారు ఇంటికి తాళం వేసి వెళ్ళేటప్పుడు ఇంటిలో ఉన్న విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో లేదా ఇతర సురక్షితమైన ప్రదేశంలో భద్రపరుచుకోవాలని సూచించారు. ఇంటిని గమనిస్తూ ఉండాలని పొరుగువారికి తెలపాలన్నారు. ఎప్పటికప్పుడు వారికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటూ ఉండాలన్నారు. వీలైనంత వరకు ఇంటి చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాల ఫుటేజ్ ను సెల్ ఫోన్ లలో చూసుకునే విధంగా అనుసంధానం చేసుకోవాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా ఇంటి పరిసరాలలో సంచరిస్తుంటే స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే వారిని అదుపులోకి తీసుకొని విచారించే అవకాశం ఉంటుందన్నారు. ఇంటి లోపల, బయట లైట్లు వేసి ఉంచాలన్నారు. దాని ద్వారా దొంగలు ఇంటిలో ఎవరో ఉన్నారు అనే భావనతో దొంగతనాలకు పాల్పడకపోవచ్చని తెలిపారు. వేసవి కారణంగా రాత్రి సమయాలలో వేడిని తట్టుకోలేక చాలా మంది ప్రజలు ఆరుబయట నిద్రించడం, ఇంటి తలుపులు తెరచి ఆదమరచి నిద్రించడం జరుగుతోందన్నారు. ఇదే అవకాశంగా తీసుకొని నేరస్తులు ఇండ్లలోకి చొరబడి చోరీలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి రాత్రి సమయాలలో ఇంటి తలుపులు తెరచి నిద్రించరాదని హెచ్చరించారు.




'పది' పరీక్షల మూల్యాంకనం ప్రారంభం

9 వరకు సాగనున్న స్పాట్ వాల్యుయేషన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు డిఆర్‌ఆర్ మున్సిపల్ హైస్కూలులో పదో తరగతి పరీక్షల మూల్యాంకనం గురువారం ప్రారంభమైంది. స్పాట్ వాల్యుయేషన్ కోసం జిల్లాకు 1.50 లక్షల పేపర్లను కేటాయించారు. పరీక్షల మూల్యాంకనానికి 150 బృందాలను ఏర్పాటు చేశారు. స్పాట్ వాల్యుయేషన్‌లో 92 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 1072 అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 250 మంది స్పెషల్ అసిస్టెంట్లు, 17 మంది ఏసిఒలు పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఏ.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పదోతరగతి పరీక్షల మూల్యాంకనం ఒంగోలు డిఆర్‌ఆర్ మున్సిపల్ హైస్కూలులో ప్రశాంతంగా ప్రారంభమైందన్నారు. మూల్యాంకనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పాల్గొనే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. మూల్యాంకనంలో పాల్గొనే వారి కోసం హైస్కూలులో క్యాంటీన్ ఏర్పాటు చేశామన్నారు. సైన్-2కి 20 మంది ఏఇలు, తెలుగుకు 10 మంది, ఇంగ్లీష్‌కు 10 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు అవసరం కావటంలో వారిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పరీక్షల విభాగ సహాయ కమిషనర్ కె.శివకుమార్, ఒంగోలు ఎంఇఒ కిషోర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయండి

బ్యాంకర్లను కోరిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బిసి, ఈబిసి, కాపు యాక్షన్ ప్లాన్‌లో బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేసి ఆయా వర్గాల ప్రజల అభ్యున్నతికి ఆర్థిక తోడ్పాటు అందించాలని కలెక్టర్ ఎ.తమీమ్‌అన్సారియా బ్యాంకర్లను కోరారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ బిసి కార్పొరేషన్ అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులతో సమావేశమై, బిసి కార్పొరేషన్ ద్వారా బిసి, రెడ్డి, క్షత్రియ, కమ్మ, ఈబిసి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కాపు వర్గాలకు స్వయం ఉపాధి పథకాలలో మంజూరు చేసిన వివిధ యూనిట్స్ గ్రౌండింగ్ పురోగతిపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బిసి, రెడ్డి, క్షత్రియ, కమ్మ, ఈబిసి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కాపు వర్గాలకు స్వయం ఉపాధి పథకాలలో 1,864 యూనిట్స్ మంజూరుకు సంబంధించిన దరఖాస్తులను జిల్లాలోని వివిధ బ్యాంకులకు పంపామన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ఈ నెల 9వ తేదీ లోపు సుమారు వెయ్యి యూనిట్స్ గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. ఈ నెల 11న జరిగే మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి రోజున సంబంధిత లబ్ధిదారులకు యూనిట్స్ మంజూరు ఉత్తర్వులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బిసి కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. బ్యాంకర్లు తమకు కేటాయించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేసిన ఆయా పేదవర్గాల ప్రజల అభ్యున్నతికి తమ వంతు సహకారం అందించాలన్నారు. ప్రతి బ్యాంకుకు ఇచ్చిన లక్ష్యాల మేరకు పథకాలు మంజూరు చేసి, గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో బిసి కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వర రావు, ఎల్‌డిఎం రమేష్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా..

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వేసవి కాలంలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ మాసం నుండి జూన్ మాసం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, వడగాల్పులు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ప్రజల కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. చలివేంద్రాలలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి హామీ పనులు జరిగే చోట పనులను ఎండ రాక ముందు, ఎండ తీవ్రత తగ్గిన తర్వాత మొదలు పెట్టాలన్నారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు పనులకు విరామం ఇవ్వాలన్నారు. అత్యవసరమైన పరిస్థితిలో పనిచేయవలసి వస్తే అక్కడ వారు మంచి నీళ్లు, ఎలక్ట్రో నీళ్లు, పండ్ల రసాలు తీసుకోవాలన్నారు. వడదెబ్బ కారణంగా మరణాలు జరగకుండా చూసుకోవాలని, ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పత్రికలు, కరపత్రాలు, దేవాలయాలు, మసీదులు, చర్చిలలో ఉండే మైకుల ద్వారా ప్రజలకు అవగాహన కలిగే విధంగా ప్రచారం చేయాలని వైద్య శాఖ అధికారులకు తెలిపారు. ఆశా వర్కర్లు ఒంటరి వద్ద మహిళల ఆరోగ్య పరిస్థితులను ప్రతిరోజూ పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డయేరియా వ్యాధి సోకకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సచివాలయ పరిధిలో తాగునీటిని అన్ని రకాల పరీక్షలు చేయడానికి సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వడమైనదని తెలిపారు. దోమల ద్వారా మలేరియా వ్యాధి సోకకుండా నీళ్లు నిల్వ ఉన్న ప్రదేశాలను గమనించి నీళ్లు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గ్రామాలలో, పట్టణాలలో ప్రజలు ప్రతి గురువారం రాత్రికి డ్రమ్ములలోని నీటిని తీసివేయాలని, శుక్రవారం ఉదయం వాటిని ఎండబెట్టి సాయంత్రం నీళ్లు నింపుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రజలకు కుక్కల బెడద లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 70 సంవత్సరాల పైబడిన వారికి ఆయుష్మాన్ భారత్ కింద కార్డు జారీ చేయటానికి చర్యలు తీసుకోవాలని, అందుకు ఈకేవైసీ చేయించాలని జిల్లా వైద్యాధికారులను ఆయన ఆదేశించారు. దీని ద్వారా వారికి రూ.5 లక్షల వరకు వైద్య సేవలు వర్తిస్తాయని తెలిపారు. ఈ కార్డు ఉన్నవారు ఇతర రాష్ట్రాల్లో కూడా వైద్యసేవలు పొందవచ్చని తెలిపారు. గ్రామాలలో, పట్టణాల్లో శానిటేషన్‌పై కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆరా తీశారు. శానిటేషన్‌పై ఐవిఆర్‌ఎస్ ద్వారా సర్వే చేస్తున్నట్లు తెలిపారు. 42 శాతం మంది అసంతప్తి వ్యక్తపరిచినట్లు తెలిపారు. ప్రతిరోజూ సిబ్బంది ఇంటింటికి వెళ్లి తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర వస్తువులను వేరువేరుగా సేకరించాలని, వాటిని ఎస్‌డబ్ల్యూపిసి ప్రదేశంలో వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. సేకరించిన చెత్తను రోడ్లకు ఇరువైపులా పడవేస్తున్నట్లు గమనించామన్నారు. కొన్నిచోట్ల వాటిని కాల్చివేస్తున్నట్లు తెలిపారు. ఇకపై చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేసినా, కాల్చినట్లు తెలిసినా సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన అధికారులను హెచ్చరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులలోని నీటి నిల్వలపై జిల్లా కలెక్టర్ ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులను ఆరా తీశారు. వేసవి కాలంలో ఎక్కడ నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులు ఆదేశించారు. నీటి సరఫరా లో పైపుల లీకులను గమనించి ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేయించాలని, నీరు వధా కాకుండా చూడాలని, నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. తక్కువ లోతుల గల బోర్ల నుండి నీటిని వాడవద్దని, అవి కలుషితంకు గురి అవుతున్నాయని ప్రజలకు అవగాహన కలిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. గ్రామ సచివాలయ, వార్డు సచివాలయ పరిధిలో నిర్వహించే సర్వేలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని కొన్ని మండలాల్లో ఇంటి వద్ద పనికి సంబంధించి సర్వే పూర్తి కాలేదని, వాటిని ఈ నెల ఆరవ తేదీలోపు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. విలేజ్ ప్రొఫైల్ ఆధారంగా వాటిని సరిచూసుకోవాలని తెలిపారు. ఆరు సంవత్సరాల లోపు పిల్లల ఆధార్ ఎన్రోల్మెంట్ ను అంగన్వాడి, ఏఎన్ఎంల సహకారంతో ఈనెల 10వ తేదీలోపు పూర్తి చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ప్రతి గ్రామంలో వ్యక్తిగత అవసరాలు, సామూహిక అవసరాలపై సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఎంపీడీవోలను ఆదేశించారు. గ్రామాలలో పశువుల కోసం పచ్చి గడ్డి పెంచేందుకు ప్రభుత్వ భూములను, వాగులు, కాలువలు, కుంటల ప్రక్కన భూములను గుర్తించి నివేదిక తయారు చేయాలన్నారు. ఆ భూములలో బోర్లను ఏర్పాటు చేసి.. వాటి ద్వారా ఆ ప్రదేశంలో పచ్చగడ్డిని పెంచి వాటిని అమ్మి గ్రామాల యొక్క తలసరి ఆదాయం పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి డి.గంగాధర్ గౌడ్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ అనంతరాజు, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, బాపట్ల డిఎల్‌డివో విజయలక్ష్మి, వీక్షణ సమావేశం ద్వారా మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.